పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సర్వం సిద్ధం



ఏలూరు,మార్చి 2 ప్రభాతవార్త : తూర్పు ,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏలూరు సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ సెల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కౌంటింగ్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. కౌంటింగ్ లో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. కలెక్టరేట్లో మొదటి విడత శిక్షణ అందించగా ,పూర్తి అవగాహన కలిగించేందుకు రెండో విడతగా కౌంటింగ్ హాల్లో ప్రాక్టికల్ గా శిక్షణ అందించామన్నారు. ఈ నెల 3వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికలకు సంబంధించి2,18,902 ఓట్లు పోలయాన్నారు. ఈ ఓట్ల లెక్కింపు 2,3 రోజులు సమయం పట్టవచ్చు అన్నారు. అందుకు గాను ఓట్ల లెక్కింపు కోసం మూడు షిఫ్ట్ ల్లో 700 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు.సుమారు 17 రౌండ్ల లో కౌంటింగ్ కు ఏర్పాట్లు చేశామన్నారు.పూర్తి భద్రత ఏర్పాట్లు మధ్య కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి కౌంటింగ్ సిబ్బందికి డ్యూటీ పాసులు అందించామని, అదేవిధంగా ఏజెంట్లకు ఐడీ కార్డులు జారీ చేశామన్నారు. పాస్ లేనిదే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించబడదన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్ లు అనుమతించబడవని, బయటే ఉంచుకోవాల్సి వస్తుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద నిర్వహించబడుతుందన్నారు..తొలుత కౌంటింగ్ హాల్లో ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. సోమవారం నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు చేయవలసిన అన్ని ఏర్పాట్లపై మరో మారు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్య వరకు విద్యుత్ సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ ఈ సాల్మాన్ రాజు ను కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ వెంట అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్ర రావు,డి ఆర్ ఓ వి. విశ్వేశ్వరరావు,ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్,డి ఎస్ పి శ్రావణ కుమార్,జడ్పీ సీఈవో కె.సుబ్బారావు,డి ఆర్ డి ఎ పిడి అర్.విజయరాజు,సివిల్ సప్లైస్ డియం శ్రీలక్ష్మి,ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మాన్ రాజు తదితరులు ఉన్నారు.

# ఘనంగా సాగుతున్న శ్రీ పోలేరమ్మ జాతర

**పెనుమంట్ర, మార్చి-02, ప్రభాతవార్త:** మండలంలోని మార్టేరులో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి జాతర రెండవ రోజు ఘనంగా సాగుతుంది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు మొక్కుబడులు ఉదయం నుండి సమర్పించుకొని అమ్మవారి ఆశీర్వచనాలు పొందుతున్నారు. శనివారం రాత్రి నుండి తెల్లవారి వరకు అమ్మవారి ఊరేగింపు వైభవంగా బుట్ట బొమ్మలతో కేరళ వాయిద్యం, భవానీలతో భారీ బాణా సంచా కాల్పులుతో అమ్మవారిని ఊరేగించారు. అనంతరం అమ్మవారికి దర్శనం ప్రారంభమైంది. పోలేరమ్మ అమ్మవారిని ఆచంట శాసన సభ సభ్యులు పితాని సత్యనారాయణ దర్శించుకుని పూజలు చేశారు. పితానికి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానం చేసారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనం కు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దగ్గర ఉండి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం ప్రతి వీధిలో సాంస్కృతిక కార్యక్రమలు జరుగుతాయని కమిటీ తెలిపింది. అలాగే ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఎస్ ఐ స్వామి తన సిబ్బందితో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుండి గ్రామంలో పెద వీధిలో తీర్థం జరిగింది. సోమవారం అమ్మవారిని పుట్టింటి నుండి అత్తి%శీ%టికి పంపుతారని కమిటీ తెలిపింది. శ్రీ పోలేరమ్మ జాతర అంగరంగ వైభవంగా జరుగుతుండడంతో గ్రామ ఆడపడుచులు తమ తమ పుట్టింటి చేరుకోవడంతో ప్రతి కుటుంబంలో మరింత శోభ సంతరించుకుంది. దీంతో అన్ని కుటుంబాలు కుటుంబ సభ్యుల సమేతంగా పెద్ద ఎత్తున



విందు ఏర్పాట్లు చేసుకుని పోలేరమ్మ జాతరను పండుగ వాతావరణంలో ఘనంగా జరుపుకుంటున్నారు.

# కలుషితమైన వారతిప్ప మంచినీటి చెరువు ప్రభాతవార్త శీర్షిక కు స్పందించి
## మరమ్మతు పనులు ప్రారంభించిన పంచాయతీ సిబ్బంది

**మొగల్తూరు మార్చి 2 ప్రభాతవార్త:** మొగల్తూరు మండలం వారతిప్ప గ్రామపంచాయతీలో ఇటీవల కలుషితంగా మారిన మంచినీటి చెరువు ప్రభాతవార్త శీర్షికకు స్పందించి చెరువు మరమ్మతులు ప్రారంభించిన పంచాయతీ సిబ్బంది ఆదివారం పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలోని మంచినీటి చెరువు గట్టుపై ఎటువంటి చెత్త గాని చెదారము గాని వేయరాదు చెరువులో ఆవులు మరియు గేదెలను వదలరాదు దీనిని అధిక్రమించిన వారిపై కఠిన చర్యలు మరియు1000, రూపాయలు విధించబడును ఎవరైనా సరే చెరువులో గేదెలు గాని ఆవులు గాని ఉన్నచో పట్టించిన వారికి 500 రూపాయలు పారితోషకం ఇవ్వబడును వారతిప్ప పంచాయతీ కార్యదర్శి రాజు పేర్కొన్నారు.



# పంట చేలకు నీరందక ఈడూరు లో రైతుల నిరసన



**అత్తిలి - మార్చి 2 ( ప్రభాత వార్త ):** అత్తిలి మండలం ఈడూరు గ్రామపంచాయతీ పరిధిలో దాళ్వా పంటకు సాగునీరు అందక వరి పొలాలు బీట్లు మారిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాల కారణంగా సార్వా పంట పూర్తిగా పాడైపోయింద ని,రెండు ద పాలు ట్రాక్టర్. విత్తనాలు పెట్టుబడి గా 6 వేల రూపాయలు ఒక రైతు ఒక ఎకరానికి ఖర్చుపెట్టారు. సార్వా మూడోదాప పంట ఉడ్చలేక మొత్తం400 ఎకరాలు గ్రామపంచాయతీ పరిధిలో వదిలేశారు . నష్టపోయిన రైతుకుఎటువంటి పరిహారం అందలేద ని వాపోయారు. . దాళ్వా పంటకు ఒక ఎకరానికి 35 వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని తీరా పంట ఈనికి దశకు వచ్చేటప్పటికి సాగునీరు అందక చే లు బీట్ల బారి కారణంగా పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు . ఈడూరు గ్రామంలో పంట చేలోకి దిగి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికే అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి . కౌలు వ్యవసాయం చేస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ తోపాటు గ్రామ రైతులు. సంకు లక్ష్మణరావు. బొక్క యాకోబు. వనపల్లి సుబ్బారావు తదితరులు నిరసన కార్యక్రమం లో పాల్గొన్నారు.

# స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**ఏలూరు,మార్చి-01, ప్రభాతవార్త:** ఏలూరు సర్ సి. ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్ ల స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత, నిఘా వ్యవస్థను శనివారం తూర్పు పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి,ఏలూరు జిల్లా కలెక్టర్ కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. తూర్పు పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్ లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం లాగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 27 న నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ అనంతరం సర్ సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో బ్యాలెట్ బాక్స్ లను సురక్షితంగా భద్రపరచడం జరిగిందన్నా రు. స్ట్రాంగ్ రూము వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లతో పాటు సీసీ కెమెరాలతో నిరంత పర్యవేక్షణ కోసం కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామన్నారు.మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉంటుందన్నారు.



# రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం -వైకాపా నేత సుంకర



పోడూరు, మార్చి-02, ప్రభాతవార్త: రానున్న ఎన్నికలలో వైకాపా గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వైకాపా నేత సుంకర సీతారా మ్ ధీమా వ్యక్తం చేశారు. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఆధ్వర్యంలో ఆచంట నియోజకవర్గస్థాయి పార్టీ పదవులు కేటాయింపులు జరిగాయి. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఆచంట మండలానికి చెందిన నియోజకవర్గం ఎస్సి సెల్ అధ్యక్షులుగా పిల్లి రుద్ర ప్రసాద్, బిసి సెల్ అధ్యక్షులుగా మొల్లేటి రామకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ ఖాసిం, వివర్స్ సెల్ అధ్యక్షులుగా వీరా వీరాభద్రం, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా నంబూరి రాజా, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులుగా కుక్కల కిరణ్ కుమార్, వికలాంగుల విభాగం అధ్యక్షులుగా చదలవాడ ముత్యాలరావు నియమించారని తెలిపారు.వైసీపీ నాయకులు వీరికి శాలువాలు పులదండలు వేసి అభినందించారు. అనంతరం సుంకర సీతారామ్ మాట్లాడుతూ పార్టీ పదవులు ఎంపికలో ఆచంట మండలానికి సముచిత స్థానం కల్పించారని అన్నారు. పదవులు పొందిన నాయకులు పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలకు అన్ని విధాలా పార్టీ అండగా ఉండే విధంగా పని చేయాలనీ అన్నారు. చెరుకువాడ శ్రీరంగనాధరాజుకు వైసీపీ జిల్లా అధ్యక్షులు, ముదునూరి ప్రసాద్ రాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆచంట టౌన్ అధ్యక్షులు పెచ్చెట్టి సత్యనారాయణ,వైసీపీ సీనియర్ నేత కోట వెంకటేశ్వరరావు,కోళ్ల రాజారావు, కేతా తాతరావు, పెచ్చెట్టి రామారావు, కాండ్రేగుల కనకేశ్వరరావు అరుపల్లి శ్రీను, తాళ్ళ కుమార స్వామి, విశ్వనాదుల సత్య నారాయణ,వడ్లపాటి అంబేద్కర్,యాళ్ల బాలాజీ, చదలవాడ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి లీగల్ సెల్ అధ్యక్షునిగా ప్రకాష్



**ప్రభాతవార్త నరసాపురం :** మూడు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్న వెన్న సూర్య ప్రకాష్ వైయస్సార్ పార్టీలో పలు పదవులను అలంకరించారు. తాజాగా నరసాపురం నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్షులుగా ప్రకాష్ కు పదవి లభించింది. గతంలో ఆయన స్థానిక శివాలయం కమిటీ చైర్మన్గా కూడా పనిచేశారు. ఆయనకు నూతనంగా పదవి రావడం పట్ల పలువురు న్యాయవాదులతో పాటు వైసిపి నాయకులు హర్షం వెలిబుచ్చారు.

# వైసీపీలో పలువురికి
## అధ్యక్ష పదవులు



**ప్రభాతవార్త నర్సాపురం :** నర్సాపూర్ నియోజకవర్గ వైసిపి 27 మందికి వివిధ విభాగాల్లో అధ్యక్ష పదవిని ఇచ్చింది. నియోజకవర్గంలో యువజన విభాగం అధ్యక్షునిగా చినమిల్లి చంద్ర శేఖర్ ను ఎంపిక చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలుగా అడిదెల విజయ శ్యామల నియమింపబడ్డారు వాణిజ్య విభాగం అధ్యక్షునిగా ఎర్ర శ్రీనివాస్ ఎంపి కయ్యారు. బీసీ సెల్ కు పతివాడ మార్కండేయులు నియమింపబడ్డారు. వీరందరిని పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు అభినందించారు.

# 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ' ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి కృషి
## మత్స్యకారుల సమస్యల చర్యలు తీసుకోవాలి కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ



**భీమవరం మార్చి 2 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ' ద్వారా మత్స్యకారుల సంక్షేమంతోపాటు మత్స్యరంగ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆదేశించారు. బిజెపి నర్సాపురం పార్లమెంట్ కార్యాలయంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ను నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు మైల వసంతరావు, పాలకవర్గం సభ్యులు కలసి జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెరైన్ సైడ్ ఉన్న సంత మార్కెట్లులో ఫిష్ మార్కెట్లలో వసతులు కల్పించడం, పంచాయతీరాజ్ చెరువుల వేలంలో 10% పరిమితి దాటకుండా చర్యలు తీసుకోవాలని,వలలు, నావలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని ఎస్టి, ఎస్సీ,బీసీలకు 75% పెంచాలి అని, మత్స్యకార సొసైటీ గ్రామలలో మత్స్యకార కమ్యూనిటీ హాల్ నిర్మించడం, మత్స్యకారుల వాహనాలు ఇచ్చే రాయితీ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకి అందజేశారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ జిల్లా మత్స్యశాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు.మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజా బాలాజీ, డైరెక్టర్లు వూడిమూడి శ్రీనివాస్, బేరం శ్రీరామచంద్రమూర్తి, బెజవాడ నాగరాజు, తిరుమాణి సీతామాలక్ష్మి ,మోకా ఆంజనేయులు , జంపా అప్పారావు, కోపనాతి శ్రీనివాసరావు, పిడిగే జోసెఫ్ , వైదాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లలెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి..
## - రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి..



**ఏలూరు, మార్చి 2 ప్రభాతవార్త :** ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తియ్యేవరకు అత్యంత అప్రమత్తతతో లెక్కింపు ప్రక్రియ నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కౌంటింగ్ విధులు కేటాయించిన ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో విధులు కేటాయించిన ఓట్ల లెక్కింపు సిబ్బంది, టేబుల్ సూపర్ వైజర్లు, రోల్ ఇన్ చార్జ్ లు, పర్యవేక్షణ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్ లెక్కింపులో పూర్తి ఏకాగ్రతతో కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు తెరిచే సమయంలో, బండ్లింగ్ చేయుట, లెక్కించుట ప్రక్రియల నిర్వహణలో ఎన్నికల కమీషన్ నిర్ధేశించిన మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపరు, మొదటి ప్రాధాన్యత ఓటు, నమోదు విధానం ద్వారా జరుగుతున్న నేపద్యంలో ఓట్లలెక్కింపు చాలా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఓట్ల లెక్కింపుకు సంబంధించి 456 పోలింగ్ బూత్ ల నుండి వచ్చిన బ్యాలెట్ బాక్సుల్లో ఉన్న ఓట్లు లెక్కింపుకు 28 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ టేబుల్ కు కౌంటింగ్ సిబ్బందితో పాటు టేబుల్ సూపర్ వైజర్, రోల్ ఇన్ చార్జి, షిఫ్టు ఇన్ చార్జి లతోపాటు మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై ఇప్పటికే శిక్షణా తరగతులు నిర్వహించుకున్నామని, దానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈనెల 3వ తేదీన ఏలూరు సర్. సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే ఓట్ల లెక్కింపు విధులకు షిఫ్టుల వారీ 700 మంది సిబ్బందిని నియమించామని సోమవారం ఉదయం షిఫ్టుకు కేటాయించిన సిబ్బంది ఉదయం 6.30 గంటల ఖచ్చితంగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు.

# నాటు సారాయి వల్ల జరిగే అనర్థాలు
## గ్రామ ప్రజలుకు అవగాహన సదస్సు


**చింతలపూడి ప్రభాత వార్త :** చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిదిలో గల చింతలపూడి మండలం పంతంగలగూడెం గ్రామములో నాటు సారాయి వల్ల జరిగే అనర్థాలు గురించి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి , నాటు సారాయి తయారీ , కలిగి ఉండుట , విక్రయించుట, రవాణా చేయుట ఎక్సైజ్ నేరము తెలుపుతూ , అట్టి వారు ఎవరైనా ఉంటే వారి వివరములను టోల్ ఫ్రీ నెంబర్ 14405 కు గాని ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి సెల్ నెంబర్ 9440902428లిగాని తెలిపినచో సమాచారము ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి , వెంటనే సదరు గ్రామము లో నాటు సారాయి స్థావరాలు పై దాడులు నిర్వహించి ,వారి పై కేసులు నమోదు చేయబడును మరియు అందరి చే ప్రతిజ్ఞ చేయడమైనది ఈ కార్యక్రమములో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐ.లు



ఆర్.వి.ఎల్.నరసింహా రావు, అబ్దుల్ ఖలీల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు అని ఎక్సైజ్ సి.ఐ. పి.అశోక్ తెలిపినారు!

# గ్రామాల్లో నీటి కొరత రాకుండా నూతన బోరు ఏర్పాటు

**కొయ్యలగూడెం ప్రభాతవార్త మార్చి 2:** అంకాల గూడెం గ్రామ ప్రజలకు మంచినీటి కొరత తీరనుంది. బోడిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోఉన్న అంకాల గూడెం గ్రామంలో రెండు బోర్లు ఉన్న ఎస్సీ ప్రాంతంలో ఉన్న ఒక బోరు పాడైపోవడంతో ఎస్సీ కాలనీ ప్రాంత ప్రజలకు మంచినీరు లేక గత 20 రోజుల నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న సంబంధిత పంచాయతీ అధికారులు, ఎంపీడీవో కిరణ్ కుమార్ మంచినీటి ట్యాంకును సందర్శించి బోర్ రిపేర్ చేయించడం జరిగింది. అయినప్పటికీ నీరు కొరత ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఎంపీడీవోకు తెలియజేయగా, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మండల ప్రజా పరిషత్ నిధులతో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నూతన బోరును నిర్మించడం జరుగుతుంది. నూతన బోరు నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటనే మంచినీటి ట్యాంకు కు కనెక్షన్ ఇచ్చి ప్రజలకు నీరు సరఫరా చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. నూతన బోరు నిర్మించడంతో మంచినీటి కష్టాలు తీరుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులకు, నాయకులకు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపి, హర్షం వ్యక్తం చేశారు.



# ప్రతి స్త్రీ ఒక శక్తి స్వరూపిణి సృష్టికి ప్రతి సృష్టి మహిళ



**భీమవరం మార్చి 2 ప్రభాతవార్త :** ప్రతి స్త్రీ ఒక శక్తి స్వరూపిణి అని, సృష్టికి ప్రతి సృష్టి మహిళా అని ప్రభుత్వ కేడీఎస్ పిడి లక్ష్మీకాంతం అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పిఎస్ఎం బాలికొన్నత పాఠశాలలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. లక్ష్మీకాంతం మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలు మహిళల కట్టు బొట్టు నడవడికకు నిదర్శనమని అన్నారు. 40 ఏళ్లుగా మహిళ దినోత్సవ వేడుకలను వారోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అధ్యాపకురాలు జేడిగుంట సునీత, నాచు శ్రీవల్లి, మహిళ పోలీస్ హెడ్ ఎండి షేహానాజ్, ఎండి సరోజినీ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, బాల్య వివాహాలు అనార్థమని మహిళలపై ఘటనలు బాధాకరమని, ఇటువంటి ఘటనలను ప్రతిఘటించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ వరకు మహిళ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని, రంగవల్లులు పోటీలు, మహిళ సాధికారత పై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం వారణాసి రాధాకృష్ణ, కలిగోట్ల గోపాలశర్మ, ఉపాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం



తాడేపల్లిగూడెం మార్చి-02, ప్రభాతవార్త: సామాజిక పెన్షన్ లను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బల్పడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు. పింఛన్లను అందజేస్తున్న సందర్భంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి లబ్ధిదారులను కుశల ప్రశ్నలు వేస్తూ ఆరోగ్యం బాగుందా, ఇంటికి వచ్చి పెన్షన్ అందజేస్తున్నారా, నెలకు ఎంత ఇస్తున్నారు, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారని అని ఆరా తీశారు. లబ్ధిదారులు స్పందిస్తూ మొదటి తేదీన వేకువజామునే ఇంటి వద్ద పింఛన్ అందుకుంటున్నామని, ఇబ్బందులు ఏమీ లేవని సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని ఉ ద్దేశంతో పింఛ ను మొత్తాన్ని పెద్ద ఎత్తున పెంచి అందజేయడం జరుగుతుందన్నారు. పింఛను సద్వినియోగం చేసుకొని ఖర్చులు పోను నెలనెలా కొంత మొత్తాన్ని. పొదుపు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 25 రకాల పింఛన్లను 2,26,044 మంది లబ్ధిదారులకు రూ.96.61 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. నూరు శాతం పింఛన్లు పంపిణీని వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పింఛన్దారుల ఇంటి వద్దకే



వెళ్లి పింఛన్లను అందజేయాలని ఏదైనా ఫిర్యాదు అందుకే చర్యలు తప్పవని హెచ్చరించారు. పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీఓ కతీబ్ కౌసర్ భానో, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, తహసిల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథం, సర్పంచ్ మద్దుకూరి గంగా భవాని, డిఆర్డిఏ ఏపీవో పెన్షన్స్ టి.మురళీకృష్ణ,, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకమును పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం : మార్చి-02, ప్రభాతవార్త: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకమును పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకమును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి లాంఛనంగా ప్రారంభించారు. పశువులకు వేస్తున్న టీకాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 1,86,800 ఆవులు, గేదలు ఉన్నాయని, వీటికి మార్చి ఒకటి నుండి మార్చి 30 వరకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు, 3వ విడతగా 9,300 పెయ్య దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లలోని పశుపోషకులందరు పశువులకు టీకాలు తప్పక వేయించాలన్నారు. మనదేశములో పశువులకు 2030వ సంవత్సరము నాటికీ గాలి కుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకమును ప్రవేశపెట్టి పశువులకు టీకాలను అందజేయడం జరుగుతుందన్నారు.

**గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల వలన కలిగే లాభాలు:**
వ్యాధి సోకిన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చు, వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా అరికట్టవచ్చు, దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగడనికి ఉ



పయోగపడుతుందన్నారు. తీవ్రమైన జ్వరం మరియు నీరసం, నోటినుండి తీగల మాదిరి చొంగ, నోరు మరియు కలి గిట్టల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా రోప్పటం, చూడి పశువులు ఈసుకు పోవడం వ్యాధి లక్షణాలు అన్నారు. ఈ వ్యాధి కారణంగా పాల ఉత్పత్తి మరియు పని సామర్థ్యం గణ నీయంగా తగ్గిపోవడం వలన రైతుకు ఆర్థిక నష్టం, పాలు త్రాగే దూడల్లో మరణాలు సంభవించడం, వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోయి నష్టపోవడం జరుగుతుందన్నారు.

**బ్రుసెల్లోసిస్ వ్యాధి నియంత్రణ పథకము**
ఈవ్యాధి లక్షణాలు సోకిన పశువుల గర్భస్రావాలు, మాయ మరియు పాల ద్వారా ఇతర జంతువులకు వ్యాపిస్తుందని, వ్యాధి సోకిన పశువుల నుండి మనుషులకు సోకుతుందన్నారు. నివారణ, నియంత్రణలకు జిల్లా పశు సంవర్ధక శాఖ వారు జిల్లాలోని అన్ని పశువులకు పశు వైద్య శాలలో మరియు పశుపోషకుని ఇంటి వద్దనే సంవత్సరానికి మూడు విడతలుగా ఉచితంగా బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయుటం జరుగుతుందన్నారు. 4-8 నెలల వయస్సు గల పెయ్య దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. పాలను ఎల్లప్పుడూ బాగా మరిగించి వినియోగించుకోవాలన్నారు. వ్యాధి గ్రస్థ పశువు మిగిల్చిన మేత, గర్భస్రావ మట్టు, మాయ, పిండాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టాలన్నారు. బ్రుసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని, నివారణకు టీకా ఒక్కటే మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డిఓ కతీబ్ కౌసర్ బానో, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, తాడేపల్లిగూడెం డిడి డాక్టర్ సుధాకర్, ఏడి డాక్టర్ అనిల్, మాధవరం వి ఏ ఎస్ డాక్టర్ సునీల్, పట్టెంపాలెం వి ఏ ఎస్ డాక్టర్ విజయ్ కుమార్, తహసిల్దార్ సునీల్ కుమార్, సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని, పశుపోషకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం మార్చి-02, ప్రభాతవార్త: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరుగుచున్నదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం స్థానిక శ్రీ వాసవి గ్రంధి మాణిక్యాలరావు జూనియర్ అండ్ డిగ్రీ కాలేజ్ లోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి క్లాస్ రూమ్ కి వెళ్లి నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎవరికైనా ఆరోగ్య సమస్య తలెత్తితే వెంటనే ఫస్ట్ ఎయిడ్ కు సిద్ధంగా ఉండాలని వైద్య శాఖ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో మార్చి ఒకటి నుండి మార్చి 20 వరకు 52 పరీక్ష కేంద్రాలలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించుచున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 19,708 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం



18,123 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ప్రశ్నాపత్రాలు భద్రపరిచేందుకు జిల్లాలో 13 స్టోరేజ్ పాయింట్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, మూడు సెట్టింగ్స్ స్క్వాడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షల నిర్వహణలో ఏదైనా సమస్య తలెత్తితే పరిష్కరించేందుకు భీమవరం కేజీఆర్ఎల్ జూనియర్ కళాశాల నందు కంట్రోల్ రూమ్ నెంబర్ 9491722692 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని ఎగ్జామినేషన్ సెంటర్ల పరిధిలో 144 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఎగ్జామినేషన్ సెంటర్ల వద్ద ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలను పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంలో తహసిల్దార్ సునీల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ విఎస్ఎన్ శ్రీనివాసు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ డి.సత్యనారాయణ, డివో బి.గంగరాజు, తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యా హామీ కూలీలకు నూరు శాతం పనులు కల్పించే లక్ష్యం



తాడేపల్లిగూడెం మార్చి-02, ప్రభాతవార్త: ఉపాధ్యా హామీ కూలీలకు నూరు శాతం పనులు కల్పించే లక్ష్యంతో అధికారుల పని చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలతో చేపట్టిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూడికతీత పనులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోజులు పనులు వస్తున్నాయి, ఎన్ని రోజుల నుంచి ఈ ట్యాంక్ పనులు చేస్తున్నారు, నగదు అకౌంట్లో జమ అవుతుందా, పనికిరాని వారికి కూడా మస్తరు వేస్తున్నారా తదితర ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. పనిచేస్తున్న కొంతమంది వృద్ధులను గమనించిన జిల్లా కలెక్టర్ మీకు ఈరోజు పెన్షన్లు అందాయా అని అడగ్గా, పనికి వచ్చామని ఇంకా అందలేదని తెలియజేయడంతో జిల్లా కలెక్టర్ వెంటనే ఎంపీడీవోని పిలిచి ఉపాధి కూలీలకు పని ప్రదేశంలోనే వెంటనే అందజేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులను కల్పించడం చాలా సంతోషంగా ఉందని, మా జీవనానికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. శనివారం పనులకు హాజరైన మస్టర్ ను జిల్లా కలెక్టర్ స్వయంగా పేరు పేరున పిలిచి హాజరును పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రమశక్తి సంఘాలు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించడానికి ఈరోజు నవాబుపాలెం రావడం జరిగిందన్నారు. జిల్లాలో సుమారు పదివేల మందికి ఎన్ ఆర్ జి ఎస్ పనులను కల్పించడం జరిగిందని, మరిన్ని పనులను గుర్తించి కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. నవాబుపాలెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూడికతీత పనులను గత 17 రోజుల నుండి 253 ఎం ఆర్ జి ఎస్ కూలీలతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కాలువలు, డ్రైన్లు పూడిక తీత పనులను పెద్ద ఎత్తున చేపట్టను జరుగుతుందన్నారు. వంద రోజులు పనులు కల్పించటమే లక్ష్యంగా అధికారులు పనులను గుర్తించి పనులను కల్పించాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కుడిక తీసిన మట్టిని ట్యాంక్ గట్ల పటిష్టతకు ఉపయోగించడం జరుగుతుందని, అనంతరం హార్టికల్చర్ ఆధ్వర్యంలో మొక్కలను కూడా నాటించడం జరుగుతుందన్నారు. మస్తరులో అవకతవకలు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ఇప్పటికే ఇద్దరి ఫీల్డ్ అసిస్టెంట్లను విధులనుండి తొలగించడం జరిగిందన్నారు. సామాజిక ఆడిట్ ను బహిరంగంగానే నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా పలుగు పట్టుకొని ఉపాధి కూలీలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, తాడేపల్లిగూడెం ఆర్డిఓ కతీబ్ కౌసర్ భానో, ఎంపీడీవో ఎం.విశ్వనాథం, సర్పంచ్ ఎం.గంగా భవాని, మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, తదితరులు ఉన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం: మార్చి-02, ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భీమవరం పురపాలక సంఘం పరిధి 6వ వార్డు బొక్కా వారి పేటలో ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వయంగా పాల్గొని 10 మంది లబ్ధిదారులకు పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులను పలు ప్రశ్నలను అడిగారు మీ ఆరోగ్యం ఎలా ఉంటుంది ప్రతి నెల ఒకటవ తేదీ ఉ దయం సిబ్బంది మీ ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ సొమ్మును అందిస్తున్నారా, పెన్షన్ సొమ్మును మీరు ఉపయోగించుకుంటున్నారు. వ్యక్తిగతంగా లేక కుటుంబాలకు ఖర్చు చేస్తున్నారా అని ఆరా తీశారు. అలాగే మీ వార్డుల్లో పారిశుధ్యం బాగుంటుందా ప్రతిరోజు రాత్రి సమయాల్లో వీధి దీపాలన్నీ వెలుగుతున్నాయా, కుళాయిల ద్వారా వచ్చే మంచి నీరు బాగుంటుందా అని అడిగారు. కొంతమంది లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ సొమ్ము మాకు ఎంతగానో భరోసా కల్పిస్తుందన్నారు.



మాకు ఉన్న బీపీ, షుగరు వంటి ఆరోగ్య సమస్యలను బట్టి కొంత సొమ్మును మందులకు వాడుకోగా మిగిలిన సొమ్ము ఖర్చులకు ఉపయోగించుకుంటున్నామని అన్నారు. మా పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంటున్నాయని ప్రతిరోజు శానిటేషన్ సిబ్బంది వస్తున్నారని వీధిలైట్లు అన్నీ వెలుగుతున్నాయి, త్రాగునీరు బాగుంది ఇబ్బందులు ఏమీ లేవని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి వివరించారు, ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల కొరకు అందిస్తున్న సామాజిక పెన్షన్ సొమ్మును అందరూ మంచిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిపి, షుగర్ వంటి వ్యాధులు ఉ న్నవారికి ప్రభుత్వం ఉచితంగా మందులు ఏఎన్ఎంలు ద్వారా అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి డబ్బులు ఖర్చు పెట్టుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించి డాక్టర్లు మంచి వైద్యమును అందిస్తున్నారని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సి. హెచ్ వెంకటేశ్వరరావు, వార్డు సెక్రటరీలు, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలి

పెంటపాడు: మార్చి-02, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పెంటపాడు మండలం పరమెల్ల జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. నేరుగా తరగతి గదిలోనికి వెళ్లి ఉపాధ్యాయుడు పిల్లలకు బోధిస్తున్న పాఠాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ కొంత మంది తల్లిదండ్రులు మిమ్మల్ని ప్రయోజకులను చేయాలని మిమ్మల్ని విడిచి విదేశాలకు వెళ్లారని, మరి కొంతమంది సింగిల్ పేరెంట్ గా ఉన్నారని వారి ఆకాంక్షలకు అనుగుణంగా మీరు బాగా చదివి మంచి భవిష్యత్తు పొందాలని సూచించారు. మీరు ప్రయోజకులైతేనే వారి కలలు నెరవేరతాయన్నారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రతి ఒక్కరూ పాఠశాల నందే భుజించాలన్నారు. చదువుతోపాటు, ఆటలు కూడా ఆడుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలు క్రమం



## జాతీయస్థాయి బధిర టీ20 క్రికెట్ పోటీలకు 16 మంది ఎంపిక

భీమవరం మార్చి 02 ప్రభాతవార్త : ఏడవ జాతీయస్థాయి బధిర (మూగ చెముడు) టీ20 క్రికెట్ పోటీలకు 16 మంది ఎంపికయ్యారని జిల్లా బధిర క్రికెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు రంగసాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్ తాతారావు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన 16 మంది బధిర క్రీడాకారులు ఏప్రియల్ 19 నుంచి 25 వరకు హర్యానా కాచపూర్ గురుగామ్ లో బధిర క్రికెట్ టీ20 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం భీమవరం వెంకట్రామ థియేటర్ లో జరిగిన సమావేశంలో వివరాలను తెలిపి ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు. ఇటీవల భీమవరం డిఎన్నార్ క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి టీ20 క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారుల్లో 16 మంది జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయిలో కూడా రాణించాలని కోరుకుంటున్నామని అన్నారు. ఆర్గనైజింగ్ వైస్ చైర్మన్ టీ రాము, కోశాధికారి జి రామచంద్ర రావు, బి హెచ్ రవికుమార్ రాజు లు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ కు అందరి సహకారం కావాలని కోరారు.

## జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి

### - నిర్వహణ కమిటీలతో సమావేశానికి హాజరైన జనసేన జిల్లా ఎమ్మెల్యేలు



భీమవరం మార్చి 02 ప్రభాతవార్త : ఈనెల 14న జరగబోయే జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మంత్రి నాదెళ్ల మనోహర్ పిలుపునిచ్చారు. కాకినాడలో ఈరోజు జరిగిన నిర్వహణ కమిటీలతో సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా జనసేన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. భీమవరం నుంచి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, రాష్ట్ర ప్రోటోకాల్ చైర్మన్ మల్లినీడి బాబి, చల్లా రాము, నాగిడి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# బేటి బచావో బేటి పడావో కార్యక్రమం

పోడూరు, మార్చి-02, ప్రభాతవార్త: మండలంలోని పండిత విల్లూరు, వేడంగి, పెనుమదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 8న జరగబోవు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బేటి బచావో బేటి పడావో, కిశోర బాలికలచే సైకిల్ ర్యాలీ, బాలిక శిశు జననాల వేడుక, బాలికల పేర్లతో మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు ఐసిడిఎస్ సిబ్బంది శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మావుళ్ళమ్మను దర్శించుకున్న టీవీ యాక్టర్



భీమవరం మార్చి 2 ప్రభాతవార్త : ప్రముఖ టీవీ నటులు ఓంకార్ శ్రీ మావుళ్ళమ్మ ఆదివారం అమ్మవారి ని దర్శించుకొన్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కార్యనిర్వాహనాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆలయ సాంప్రదాయం ప్రకారం పూజాకార్యక్రమాలు ఏర్పాటుచేసారు.

## భావనారుషి వార్షికోత్సవ అన్న సమారాధన

అత్తిలి - మార్చి 2( ప్రభాత వార్త ): అత్తిలి మండలం మంచిలి గ్రామంలో పద్మశాలి కులస్తుల కులదైవం భావనా ఋషిస్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా భారీ అన్నసమారాధన కార్యక్రమాన్నీ నిర్వహించారు . ఉత్సవకమిటీ అధ్యక్షుడు యూ. శ్రీనివాస్ , కార్యదర్శి మోములేటి ప్రసాద్ , కోశాధికారి మోమ్ములేటి శ్రీనివాస్ , బోడా నరసింహమూర్తి , వెలిదిండి సత్యనారాయణ , పెండెం రాంబాబు , బోసుకొండా సత్యనారాయణ గ్రామ ప్రముఖులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రీ సర్వే నిర్వహించటం జరుగుతుంది

భీమవరం మార్చి-02, ప్రభాతవార్త: రైతులు భూములకు ఖచ్చితమైన హద్దులను గుర్తించి రికార్డులు ఆధునీకరించేందుకే రీ సర్వే నిర్వహించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో రీ సర్వే గ్రౌండ్ ట్రూతినింగ్ పనులను, సరిహద్దుల మ్యాపులను శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నేలపైన వేసిన బరకం పై కూర్చుని రైతులతో రీ సర్వే గ్రామసభలో పాల్గొన్నారు. తొలుత రైతులతో మాట్లాడుతూ రీ సర్వే ప్రయోజనాలను వివరించి, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అధికారులు ముందుగా మీకు నోటీసులు అందజేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే పనులకు సంబంధించి రైతులు అధికారులకు సహకరించాలని అన్నారు. దస్తావేజులలో తప్పులు ఏమైనా ఉంటే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రైతులు భూములకు ఖచ్చితమైన హద్దులు గుర్తించి ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించటం జరుగుచుదన్నారు. సర్వే నిర్వహించే ముందు భూ యజమానులకు తెలియజేయాలని వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు అభ్యంతరాలు ఏమైనా తెలియజేస్తే నమోదు చేసుకోవాలని అన్నారు. రైతులు భూములకు ఖచ్చితమైన హద్దులను గుర్తించి రికార్డులు ఆధునీకరణ చేసేందుకు ప్రయోగాత్మకంగా తప్పులు లేకుండా సర్వే నిర్వహిస్తున్నారన్నారు. రైతులకు ముందుగా సమాచారం అందించిన తర్వాతే సర్వే నిర్వహించాలన్నారు. రైతులు అభ్యంతరాలను ప్రామాణికంగా తీసుకుని వాటిని నివృత్తి చేయాలని అన్నారు. దస్తావేజులు తప్పులు ఉంటే సరిచేయాలని సూచించారు.

**గృహ నిర్మాణాలకు లబ్ధిదారులను ప్రోత్సహించాలి.. జిల్లా కలెక్టర్**
నవాబుపాలెం గ్రామంలో పేదల లేఔట్ ను పరిశీలించారు.



ఎంతమంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేసుకున్నారు తదితర వివరాలను తహసిల్దార్ ను అడిగి తెలుసుకున్నారు. స్థానిక మహిళలు మాట్లాడుతూ మంచినీటి సౌకర్యం కల్పించాలని, రహదారులు నియమించాలని తదితర సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందిస్తూ దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మంచినీటి సదుపాయం ఏర్పాటుపై ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. లబ్ధిదారులను ప్రోత్సహించి గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలనీ గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు.

**ఈ-శ్రమ పోర్టల్ నందు అసంఘటిత కార్మికులను నమోదు చేయించాలి..**
గ్రామ పరిధిలోని అసంఘటిత కార్మికులను నూరు శాతం నమోదు చేయించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు మంచి సర్వీసులను అందించి మన్ననలను పొందాలని సూచించారు.

# అవసరమైన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు

తాడేపల్లిగూడెం/ పెంటపాడు: మార్చి-02, ప్రభాతవార్త: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలను వసతిలో మేటిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేయడం జరుగుచున్నదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తాడేపల్లిగూడెం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం, పెంటపాడులో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల, బాలుర వసతి గృహాలు, పెంటపాడు మండలం పరిమెల్లలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాల్లో చేపట్టి పూర్తి చేసిన పనులను, జరుగుచున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వసతి గృహాలను ఉన్నతంగా ప్రభుత్వం సంకల్పించి నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో ఇప్పటికే చాలా పనులను పూర్తి చేయడం జరిగిందని, మరికొన్ని పనులు చేపట్టే పూర్తి చేయవలసి ఉందన్నారు. తాడేపల్లిగూడెం -7, పెంటపాడు -11, పరిమెల్ల -13 మరుగుదొడ్లను నిర్మించడం జరిగిందని, సెప్టిక్ ట్యాంకులను కూడా రెనోవేట్ జరిగిందన్నారు. పరిమెల్లలో వసతి గృహాన్ని పూర్తిస్థాయిలో మరమత్తులను, పెయింటింగ్ పనులను చేపట్టడం జరిగిందన్నారు. పరిమెల్ల వసతి గృహం పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు, దోమతెరలు, తదితర వస్తువులను అందజేయడం జరిగిందని, త్వరలో ఇన్వర్టర్ లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాలలో మౌలిక వసతులు పెరిగాయి అనే విషయం పిల్లల తల్లిదండ్రులకు తెలియజేసి, వసతి గృహాలలో



పిల్లలు పెద్ద మొత్తంలో చేరేలా చూడాలని హెచ్ డబ్ల్యు ఓ లను ఆదేశించారు. ల ఈ సందర్భంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో కతీబ్ కౌసర్ భానో, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి టీవీఎస్ బిఆర్ రాజు, హౌసింగ్ ఈఈలు జి.పిచ్చయ్య, వి వెంకటరమణ, డి.ఇ వై.వి వెంకటేశ్వరరావు, తహాసిల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో సిహెచ్ బాలాజీ, డి.టి డి.సీతారత్నం,ఎంఈఓ పిఎంకె జ్యోతి, హెచ్డబ్ల్యు ఓ లు వి.నయామి రాణి, ఎన్ రామలింగం, కే రామకృష్ణ, ఏ అరుణ జ్యోతి, తదితరులు ఉన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకునే నేత జగన్

తణుకు, మార్చి 02( ప్రభాతవార్తప్రభాత వార్త ): ఇచ్చిన మాట నిలబెట్టుకునే నిఖార్సయిన నాయకుడు, రాజకీయాల్లో ఒంటరిగా ప్రత్యర్థిని ఢీకొట్టే ధైర్యమున్న వ్యక్తి మన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్రెడ్డి అని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. కాఫీ విత్ కారుమూరి పేరుతో కార్యకర్తలు, నాయకులతో మమేకమై వారిలో మనోధైర్యం నెలకొల్పేందుకు వైఎస్సార్సీపీ ప్రచారకమిటీ తణుకు నియోజకవర్గ అధ్యక్షులు వీరమల్లు ఫణీంద్రకుమార్ నివాసంలో శనివారం పార్టీ శ్రేణులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరిని గుర్తు పెట్టుకుంటామని అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కక్షపూరితంగా వైఎస్సార్సీపీ నేతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అందరినీ గుర్తుపెట్టుకోమని ఇప్పటికే జగన్మోహన్రెడ్డి పార్టీ నేతలకు ఆదేశాలిచ్చారని వడ్డీతో సహా చెల్లించే రోజులు వస్తాయని అన్నారు. తణుకు నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులంతా కష్టపడాలని, భవిష్యత్తులో మీకందరికి పార్టీ అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పొట్ల సురేష్, వెస్సార్సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజింగ్ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షులు జల్లూరి జగదీష్, తణుకు నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, మైనం పాము, మమత యాదవ్, కోట స్వామీజీ, వై.రామకృష్ణ, షేక్ జిలానీ, వీరమల్లు గణపతి, కాసాని సత్యనారాయణ, వీరమల్లు శివ పాల్గొన్నారు.

